## ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

### అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



తురాబ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, నవంబర్ 13: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటేసి ప్రజలు మోసపోవద్దని అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశించే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలందరూ ఆలోచించి ఓటు వేసి.. ప్రగతికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని బాగ్‌అంబర్‌పేట డివిజన్ తురాబ్‌నగర్, నల్లకుంట డివిజన్‌లోని నర్సింహబస్తీ, గోల్నాక డివిజన్‌లోని కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు పద్మవెంకటరెడ్డి, దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్, ఎన్నికల కో ఆర్డినేటర్ పద్మావతిడీపీరెడ్డిలతో కలిసి కాలేరు వెంకటేశ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి.. ఓట్లు అభ్యర్థించారు. కాగా, అంబర్‌పేట టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు 50 మంది ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# కాంగ్రెస్, బీజేపీ నాయకులను నమ్మొద్దు

- రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- మంత్రి సమక్షంలో వెయ్యి మంది బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారికి
గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 13: మాయ మాటలు చెప్పే బీజేపీ, కాంగ్రెస్ నేతలను నమ్మవద్దని రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ 5,6, 14వ వార్డులకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, వివిధ కాలనీలకు చెందిన 1000 మంది యువకులు, మహిళలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మల్లారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు బాగా పెరుగుతున్నాయని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తెలంగాణలో ప్రతి ఒక్కరికి అందాయని, అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలన్నారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి ప్రజలను పట్టించుకున్న పాపన పోలేదని, ఇంత వరకు ఒక్క అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు ఎక్కడ లేవని విమర్శించారు. పేద ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధిక అసెంబ్లీ స్థానాలు గెలిచి మూడోసారి బీఆర్ఎస్ అధికారం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

### శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఎమ్మెల్యే గాంధీకి మంగళహారతులు పడుతున్న కాలనీవాసులు

మాదాపూర్, నవంబర్ 13: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులతోనే ప్రజల్లో రెట్టింపు ఆదరణ లభిస్తున్నదని, రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్‌లో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా మొదటగా హుడా కాలనీలోని హనుమాన్ దేవాలయం, శ్రీ సాయి బాబా దేవాలయంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హుడా కాలనీ ఫేజ్ -1, ఫేజ్-2, గంగారం విలేజ్, శాంతినగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేసి బీఆర్ఎస్‌లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందుతున్నాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు శ్రీరామ రక్ష అని అన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరికల జోష్

మేడ్చల్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): వివిధ పార్టీల నేతల చేరికలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి-సంక్షేమం వల్లే వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లిలో నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులే కాకుండా కుల సంఘాల, సంక్షేమ సంఘాల ప్రతినిధులు సైతం బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు. ఇటీవలే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు జరిగాయి. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి, తిరుపతిరెడ్డి, మంగమ్మ ముదిరాజ్, కృష్ణా మదిరాజ్ కూకట్‌పల్లి అభ్యర్థి మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఉప్పల్‌లో వైఎస్ఆర్ టీపీ నుంచి ప్రదీప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నవీన్‌రెడ్డిలు ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిజాంపేట్ మున్సిపల్ పరిధి టీడీపీ అధ్యక్షుడు అనిల్, శ్రీధర్‌రావు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అనిత కుత్బుల్లాపూర్ అభ్యర్థి కేపీ వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మేడ్చల్ నియెజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నిశీతరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు కుడికాల ప్రేమ్ కిశోర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు సబ్బని రామకృష్ణ, మేడ్చల్ మున్సిపాలిటీ పరిధికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు శ్రీనాథ్, సాయి తేజ, రాంబాబు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

## ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. గెలుపు బీఆర్ఎస్‌దే

### మంత్రి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవంబర్ 13: కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా చివరకు గెలుపు బీఆర్ఎస్‌దే అని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గెలుపు కోరుతూ కొంపల్లి మున్సిపాలిటీ ఫామ్ మిడోస్‌లో జరిగిన ప్రచారానికి మంత్రి మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిందేండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో పాటు కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మహిళా నాయకురాలు సంగీతారెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు చక్కటి ఆదరణ

కీసర, నవంబర్ 13: మేడ్చల్‌లో కాంగ్రెస్, బీజేపీలకు నూకలు చెల్లాయని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలకు ప్రజలంతా తగిన రీతిలో గుణపాఠం చెప్పడం ఖాయమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. కీసర మండలం రాంపల్లిదాయర గ్రామం నుంచి కాంగ్రెస్, బీజేపీల నుంచి సుమారు 100 మంది మంత్రి మల్లారెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీకే చక్కటి ఆదరణ ఉన్నదని, ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించడంతో నేడు ప్రజలంతా సుఖంగా జీవిస్తున్నారన్నారు. మేడ్చల్‌లో తాను భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో అమలు చేసిన ప్రతి పథకం నిరుపేదలకు గొప్ప వరంగా మారిందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో తను కోట్లాది రూపాయలతో అనేక రకాల అభివృద్ధి పనులు చేశానన్నారు. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా.. ప్రజలు తనను చక్కగా ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాంపల్లిదాయర మాజీ సర్పంచ్ గంగి మల్లేశ్, బీఆర్ఎస్ నేతలు కందాడి శ్రీకాంత్‌రెడ్డి, మీసాల మల్లేశ్, కందాడి వెంకట్‌రెడ్డి, గణేశ్‌చారి, గరుగుల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి

### ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



చిలుకానగర్‌లో మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఉప్పల్, నవంబర్ 13 : చిలుకానగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ..ప్రజల కోసం పనిచేయడానికి వచ్చానని, ఆశీర్వదించి, ఎమ్మెల్యేగా గెలుపు కోసం మద్దతు ఇవ్వాలన్నారు. కాలనీల్లో పాదయాత్ర చేస్తూ, ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

# కాలనీల సమస్యలు పరిష్కరిస్తాం

### మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి



నేరేడ్‌మెట్‌లో ప్రచారం చేస్తున్న మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 13: కాలనీల సమస్యలు పరిష్కరిస్తామని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం నేరేడ్‌మెట్, మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల మ్యానిఫెస్టోని సీఎం కేసీఆర్ ప్రకటించారని చెప్పారు. ఇచ్చిన హామీలను ఎన్నికల తర్వాత అమలుపరుస్తామని అన్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరాల కోసం స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌పై మోపిన ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు అర్హులైన వారికి రూ. 400కే సిలిండర్ అందజేయనున్నామని వెల్లడించారు. కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం, వృద్ధులు, వితంతువులు, ఒంటిరి మహిళలు, దివ్యాంగులకు నెలనెల పింఛన్ అందజేస్తున్నామని, విడతలవారీగా పింఛన్లు పెంచుతామని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదన్నారు. ప్రజలను పట్టించుకోని పార్టీలను ఇంటికి పంపాలని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కార్పొరేటర్లు మీనా ఉపేందర్‌రెడ్డి, శాంతిశ్రీనివాస్ రెడ్డి, సునీతరాము యాదవ్, సబితాకిశోర్ తదితరులు పాల్గొన్నారు.